క్లుప్తంగా

వాగులొస్తున్నాయ్.. జాగ్రత్త

గుండాల: గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని వాగులు ఉప్పొంగుతున్న నేపథ్యంలో స్థానిక గిరిజన గ్రామాల ప్రజలు వాగులను దాటొద్దని గుండాల సీఐ రవీందర్ అన్నారు. ఆదివారం మండలంలో ఉప్పొంగుతున్న వాగులను సందర్శించి, పోలీసు సిబ్బందిని వాగుల వద్ద పహారా ఉంచారు. ఈ సందర్భంగా ఆయన స్థానికులకు పలు సూచనలు చేశారు. కిన్నెరసాని, మల్లన్న వాగులను పరిశీలించి, భారీగేట్లను అడ్డంగా పెట్టారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలోని కొత్తకాలనీలో ఆదివారం విద్యుత్ శాఖ అధికారులు నూతనంగా 160 కేవీఏ సామర్థ్యం గల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. గోదావరి వరదలు వస్తే ఆ నీటిని ఎత్తిపోయడానికి ఇరిగేషన్ అధికారులు ఈ ఏడాది 190 హెచ్‌పీ మోటార్లను ఏర్పాటు చేశారు. దీనివల్ల విద్యుత్ అంతరాయం కలగకుండా ఇప్పటికే ఉన్న 100 కేవీఏ సామర్థ్యం గల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు అదనపు ట్రాన్స్‌ఫార్మర్‌ను విద్యుత్ అధికారులు ఏర్పాటు చేశారు.

రైతు బీమాకు దరఖాస్తులు

బూర్గంపాడు: కొత్తగా పట్టాదారు పాసు పుస్తకాలు పొందిన రైతులు రాష్ట్ర ప్రభుత్వం అందించే రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారి శంకర్ తెలిపారు. ఆదివారం విడుదల చేసిన ఓ ప్రకటనలో రైతులు ఆగస్టు 5వ తేదీలోగా రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. పట్టాదారు పాసు పుస్తకం, రైతు ఆధార్‌కార్డు, నామిని ఆధార్‌కార్డుతో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. గతంలో బీమా చేసుకున్న రైతులు మార్పులు, చేర్పులు ఉంటే జూలై 30వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

బోనాల జాతర

చంద్రుగొండ: మండలంలోని మంగయ్యబంజర్ గ్రామంలో ఆదివారం బోనాల జాతర ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని మహిళలు భక్తిశ్రద్ధలతో బోనం ఎత్తి పెద్ద ఎత్తున ప్రదర్శనగా పెద్దమ్మతల్లి సన్నిధికి చేరుకుని మొక్కులు తీర్చుకున్నారు.

అప్పీళ్లను పరిష్కరించాలి

భద్రాచలంటౌన్: గిరిజన సంక్షేమ శాఖలోని వివిధ కేటగిరీల ఉపాధ్యాయుల బదిలీల అప్పీళ్లను పరిష్కరించాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం భద్రాచలం ఐటీడీఏ పీఓ బి.రాహుల్‌కు వినతిపత్రం అందజేశారు. ఉపాధ్యాయులకు ఎన్టైటిల్మెంట్ పాయింట్స్‌లో నష్టం జరుగుతున్న తీరును వివరించగా.. పీఓ సానుకూలంగా స్పందించినట్లు టీపీటీఎఫ్ నాయకులు పేర్కొన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి జి.హరిలాల్, రాష్ట్ర కౌన్సిలర్ బి.ప్రసాద్ రావు, ఉపాధ్యాయ దర్శిని పత్రిక సంపాదక వర్గ సభ్యుడు ఎం.రామాచారి, జిల్లా కార్యదర్శులు డి.ఉమాదేవి, ఎ.రామ్ చంద్ పాల్గొన్నారు.

చండీ హోమం

అన్నపురెడ్డిపల్లి: మండల కేంద్రంలోని భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి వారి ఆలయంలో అర్చకులు వేదమంత్రాలతో శాస్త్రోక్తంగా చండీహోమం జరిపించారు. భక్తులు ఆలయంలో పూజలు చేసి, స్వామి వారి తీర్థప్రసాదాలను స్వీకరించారు. గురుపౌర్ణమిని పురస్కరించుకుని మండలంలోని షిరిడీ సాయి నాథుడి మందిరాల్లో పూజలు జరిగాయి.

కలెక్టర్‌ను కలిసిన సీపీఐ బృందం

భద్రాచలంఅర్బన్: గోదావరి వరద ఉధృతిని పరిశీలించేందుకు ఆదివారం భద్రాచలంలో పర్యటించిన కలెక్టర్ జితేష్ పాటిల్‌ను సీపీఐ పట్టణ కమిటీ మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. పల్లెలు ముంపునకు గురికాకుండా అధికారులను అప్రమత్తంగా ఉంచాలని, ముంపు ప్రభావిత ప్రాంతాల్లోని వాసులకు పక్కా ఇళ్లు నిర్మించాలని కలెక్టర్‌ను కోరారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో సీపీఐ పట్టణ నాయకులు సాధనపల్లి సతీష్, పితాని మనసే, చిట్టిపోతుల కృష్ణయ్య, కంభం మెట్టు శ్రీనివాస్, అశోక్ కుమార్, మహేష్, నాగు, శేఖర్ ఉన్నారు.

సౌకర్యాలు కల్పించాలి

భద్రాచలంటౌన్: గోదావరి వరదతో ముంపు గురయ్యే ప్రజలకు ఏర్పాటు చేసే పునరావస కేంద్రాలలో మెరుగైన సౌకర్యాలు కల్పించాలని దళిత మహానాడు జిల్లా అధ్యక్షుడు పుట్టి రవి డిమాండ్ చేశారు. పట్టణంలోని ఏఎంసీ కాలనీలో ఆదివారం జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సమావేశంలో కనకయ్య, హరీష్, సాగర్, రామకృష్ణ, రాజు తదితరులు పాల్గొన్నారు.

'సీతారామ' నీళ్లు ఇవ్వాలి

చంద్రుగొండ: సీతారామ నీరు జిల్లా వ్యవసాయ రంగానికే ఇవ్వాలని ఇతర రాష్ట్రాలకు సరఫరా చేయొద్దని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీపార్టీ జిల్లా సహాయ కార్యదర్శి గౌని నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. మండలకేంద్రం చంద్రుగొండలోని ప్రధాన సెంటర్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. గోదారి నీరు ఇతర ప్రాంతాలకు తరలిస్తే చూస్తూ ఊరుకోబోమన్నారు. నాయకుల ఎస్‌కె.ఉమర్, వెంకట్రావ్ పాల్గొన్నారు.

అక్కరకురాని వ్యవసాయ పరికరాలు

- వాడకం తెలియక రైతుల విముఖత
- షెడ్డులేక ఎండ, వానల్లోనే యంత్రాలు
- తుప్పు పడుతున్నా కానని యంత్రాంగం



పిచ్చిమొక్కల మధ్య మొక్కజొన్న గింజలు పట్టే యంత్రం



షెడ్డు లేక కార్యాలయం బయట ఉన్న వ్యవసాయ యంత్రాలు

గుండాల: లక్షలు వెచ్చించి వ్యవసాయ పరికరాలు కొనుగోలు చేసి నిరుపేద రైతులకు అద్దెకు ఇచ్చే ఆ యంత్రాలు నేడు ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తున్నాయి. రైతులు ఆసక్తి చూపకపోవడంతో తుప్పుపడుతున్నాయి. ఏడాది కాలంగా నిరుపయోగంగానే ఉంటున్నాయి.

అద్దె చెల్లించలేక..

స్వచ్ఛంగా కొనుగోలు చేసుకోలేని నిరుపేద రైతులకు ఉపయోగపడేలా గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (వెలుగు) ద్వారా జిల్లాలోని అన్ని మండల మహిళా సమాఖ్యలకు వ్యవసాయ పరికరాలను ఇచ్చారు. అయితే వాటికి సంబంధించి ఎమ్ఎమ్ఎస్ డబ్బులతోనే కొనుగోలు చేశారు. ఈ పరికరాలపై రైతులకు అవగాహన కల్పించి సాగుచేసే సమయంలో అద్దెకు ఇవ్వాలి. ఫ్లవ్ ఒక రోజుకు అద్దె రూ.800లు, రోటో వేటర్ అద్దె రూ.2 వేలు, మొక్కజొన్న గింజలు తీసే యంత్రం అద్దె రోజుకు రూ.2వేలు, ఎరువులు, విత్తనాలు వేసే యంత్రం రూ.1800ల చొప్పున ఉన్నాయి. ఏడాది నుంచి చాలా తక్కువ మంది రైతులు ఆ యంత్రాలను వాడుకున్నారు. అయితే ఎక్కువ ఆసక్తి లేక అద్దె చెల్లించలేక ఆ యంత్రాల వైపు కన్నెత్తి చూడడం లేదు. ఈ ఏజెన్సీ ప్రాంతంలో రైతులు పెట్టుబడి కోసం వ్యాపారులపై ఆధారపడి సాగు చేస్తుంటారు. దీంతో ఆ యంత్రాలు చెత్తలో పడేసినట్లుగానే ఉన్నాయి. వాటికి షెడ్డు ఏర్పాటు చేస్తే తప్పా లేకుంటే తుప్పు పట్టే పరిస్థితి ఉంది.

అవగాహన లేక..

ఏడాది క్రితం మండల మహిళా సమాఖ్య కార్యాలయంకు వచ్చిన వ్యవసాయ పరికరాలలో విత్తనాలు, ఎరువులు చల్లే డ్రిల్ నిరుపయోగంగా ఉంటుంది. అద్దెకు తీసుకెళ్లిన రైతులకు దానిపై అవగాహన లేక తిరిగి తీసుకువచ్చారు. స్థానిక అధికారులకు సైతం ఆపరేటింగ్ రాదు. జిల్లా అధికారులకు సమాచారం అందిస్తే యూట్యూబ్ ద్వారా చూసి చెప్తామని సమాధానం వచ్చినట్లు సమాచారం. ఆ ఆపరేటింగ్ విధానం తెలియక ఏడాది పాటుగా నిరుపయోగంగా ఉంటుంది. లక్షలు వెచ్చించి కొనుగోలు చేయించే అధికారులకు అవగాహన లేకపోతే తమకు ఎలా తెలుస్తుందని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా రైతులను ఆర్థికంగా అభివృద్ధి పరిచే ఆధునిక యంత్రాలపై పూర్తి అవగాహన కల్పించాలని రైతులు కోరుతున్నారు.

అధికారులకు నివేదించాం

తక్కువ మంది రైతులు అద్దెకు తీసుకువెళ్తున్నారు. విత్తనాలు చల్లె యంత్రంపై ఆపరేటింగ్ తెలియక జిల్లా అధికారులకు సమాచారం అందించాం. వ్యవసాయ పరికరాలు పాడవకుండా షెడ్డు కావాలని అడిగాం. త్వరలోనే నిధులు మంజూరు ఇస్తామని జిల్లా అధికారులు చెప్పారు.

– వినోద్ క్రాంతి, ఏపీఎం

గిరిజనులకు దారేది..?

- వరదకు కొట్టుకుపోయిన తాత్కాలిక వంతెన, అప్రోచ్ రహదారి
- పట్టించుకోని అధికారులు



ఇసుక వాగు ప్రవాహంతో కొట్టుకుపోయిన తాత్కాలిక వంతెన, రహదారి

అశ్వాపురం: మండల పరిధిలోని గొందిగూడెం గ్రామంలో ఇసుకవాగుపై వంతెన పనులు కాంట్రాక్టర్ నిర్లక్ష్యం, అధికారుల అలసత్వంతో అసంపూర్తిగా అర్ధాంతరంగా నిలిపివేయడంతో కనీస దారి లేక నాలుగు గిరిజన గ్రామ పంచాయతీలలోని గిరిజన గ్రామాల గిరిజనులు, ఆదివాసీలు అవస్థలు పడుతున్నారు. ఇసుకవాగుపై లోలెవల్ వంతెన తొలగించి రూ.7 కోట్లతో హైలెవల్ వంతెన నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. పనులను అర్ధాంతరంగా నిలిపివేశారు. గిరిజనుల రాకపోకలకు సిమెంట్ పైపులతో తాత్కాలికంగా వంతెన, రహదారి ఏర్పాటు చేశారు. ఇటీవల వరదకు అప్రోచ్ రహదారి, తాత్కాలిక వంతెన కొట్టుకుపోయింది. అప్రోచ్ రహదారి నాసిరకంగా నిర్మించడంతో చిన్న వర్షాలకే కొట్టుకుపోయింది. రహదారి పలుమార్లు కొట్టుకుపోయినా అధికారులు పట్టించుకోవడం లేదని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం నడవడానికి కూడా దారి లేక గొందిగూడెం, గొందిగూడెంకొత్తూరు, ఎలకలగూడెం, మనుబోతులగూడెం గ్రామ పంచాయతీలలోని గ్రామాల గిరిజనులు నానా అవస్థలు పడుతున్నారు. తప్పని పరిస్థితి అయితే వాహనదారులు గొందిగూడెం నుంచి తుమ్మలచెరువు, మొండికుంట మీదుగా మండల కేంద్రానికి వస్తూ వ్యయ ప్రయాసలకు గురవుతున్నారు. మారుమూల గ్రామమైన మనుబోతులగూడెం గ్రామానికి చెందిన గిరిజనులు అడవిలో నుంచి మణుగూరు మండలం రేగులగండి మీదుగా రాకపోకలు సాగిస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కనీసం వర్షాకాలం వరకు రాకపోకలకు తాత్కాలిక వంతెన, రహదారి పకడ్బందీగా నిర్మించాలని గిరిజనులు కోరుతున్నారు.

సమస్యల పరిష్కారానికి పోరాటాలు

అశ్వాపురం: కార్మిక వర్గ సమస్యల పరిష్కారానికి హక్కుల పరిరక్షణకు సంఘటిత పోరాటాలే శరణ్యమని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కంచర్ల జమలయ్య, నరాటి ప్రసాద్ అన్నారు. మండల కేంద్రంలో ఓం శక్తి ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం ఏఐటీయూసీ మండల 13వ మహాసభ నిర్వహించారు. ఈ మహాసభలో వారు పాల్గొని మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా కార్మికులు పోరాటాలు సాగించాలన్నారు. సభలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శులు వేల్పుల మల్లికార్జున్, గడ్డం వెంకటేశ్వర్లు, సీపీఐ మండల కార్యదర్శి అనంతనేని సురేష్, రైతు సంఘం జిల్లా నాయకుడు కమటం వెంకటేశ్వరరావు, నాయకులు మున్నా లక్ష్మీకుమారి, రెడ్డి అరుణ, సురేందర్‌రెడ్డి, ఎడెల్లి శ్రీను, కోరెం శ్రీలత, రామచందర్‌రావు, మల్లె మోహన్, సర్వ కృష్ణ, సీతరాములు, సతీష్, నరసింహారావు, బాబురావు, నాగేంద్రబాబు, ఈనపల్లి పవన్‌సాయి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యుత్ అధికారులకు ప్రశంసలు

అశ్వారావుపేటరూరల్: వరద ముంపు ప్రభావిత గ్రామాల్లో రోజుల వ్యవధిలోనే విద్యుత్‌ను పునరుద్ధరించడం, అర్ధరాత్రైన విద్యుత్ లైన్లకు మరమ్మతులు చేయడం పట్ల బాధిత గ్రామస్తులు ప్రశంసలు కురిపించారు. ఆదివారం మండలంలోని గుమ్మడవల్లి వద్దగల పెదవాగు ప్రాజెక్టును మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సందర్శనకు రాగా, ట్రాన్స్‌కో ఎస్ఈ బీకాం సింగ్, డీఈఈ నందయ్య, ఏడీఏ బీ వెంకటేశ్వర్లుతోపాటు సిబ్బంది అంతా హాజరైయ్యారు. దీంతో వారిని చూసిన బాధితులంతా ఒక్కసారిగా ఆనందం వ్యక్తం చేస్తూ.. రెండు రోజుల్లోనే విద్యుత్‌ను పునరుద్ధరించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు.

రన్నింగ్ పోటీలు ప్రారంభం

దమ్మపేట: మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ గురుకుల కళాశాలలో.. ఆదివారం జిల్లా స్థాయి పరుగు పందెం పోటీలను, ప్రిన్సిపాల్ జాను నాయక్ జెండా ఊపి ప్రారంభించారు. పోటీల్లో మొత్తం 80 మంది అథ్లెట్స్ పాల్గొనగా, రాష్ట్ర స్థాయి పోటీలకు 20 మందిని ఎంపిక చేశారు. వీరిని ఆగస్టు 7న హైదరాబాద్‌లోని సరూర్‌నగర్‌లో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు పంపనున్నామని జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ మహీధర్ రెడ్డి తెలిపారు. అథ్లెటిక్ కోచ్‌లు గిరిప్రసాద్, నాగరాజు, పీడీ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

చర్చ జరపాలి

భద్రాచలంటౌన్: ఏజెన్సీ కేంద్రమైన భద్రాచలం గిరిజన న్యాయ కళాశాల ఏర్పాటుకు అసెంబ్లీ సమావేశాల్లో చర్చ జరపాలని గోండ్వానా సంక్షేమ పరిషత్ ఆంధ్ర తెలంగాణ ఉభయ రాష్ట్రాల కన్వీనర్ సోందె వీరయ్య అన్నారు. పట్టణంలోని సుందరయ్య నగర్ కాలనీలో ముక్తి జనార్దన్ రావు అధ్యక్షతన ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కళాశాల విషయంలో భద్రాచలం ఎమ్మెల్యే తెల్ల వెంకట్రావ్, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుకి వినతిపత్రం సమర్పించి అసెంబ్లీలో మాట్లాడాలని విన్నవించినట్లు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు పాయం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

శాకాంబరీ అలంకరణ

మణుగూరుటౌన్: మండలంలోని అశోక్‌నగర్‌లోని భవానీ శంకర దేవాలయంలోని అమ్మవారు ఆదివారం శాకాంబరీ అవతారంలో దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు అమ్మవారికి 100 రకాల నైవేద్యాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ అంకం మల్లికార్జున్ ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

సేవలకు మరింత సహకారం



రోటరీ క్లబ్ నూతన కార్యవర్గంతో ప్రమాణం చేయిస్తున్న డిస్ట్రిక్ట్ గవర్నర్ శరత్ చౌదరి

బూర్గంపాడు: రోటరీ క్లబ్ ఆఫ్ ఇన్ భద్రా, రోటరాక్ట్ క్లబ్‌లు చేస్తున్న సామాజిక సేవాకార్యక్రమాలకు ఐటీసీ మరింత సహకారమందిస్తుందని ఐటీసీ పీఎస్‌పీడీ యూనిట్ హెడ్ ప్రణవ్ శర్మ అన్నారు. ఐటీసీ అనుబంధ రోటరీ క్లబ్ ఆఫ్ ఇన్ భద్రా, రోటరాక్ట్ క్లబ్‌ల నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం ఆదివారం సారపాకలోని ఐటీసీ కళాభారతి ఆడిటోరియంలో జరిగింది. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ప్రణవ్ శర్మ మాట్లాడారు. రోటరీ డిస్ట్రిక్ట్ 3150 గవర్నర్ శరత్ చౌదరి నూతన కార్యవర్గాలతో ప్రమాణ స్వీకారం చేయించారు. రోటరీ క్లబ్ ఆఫ్ ఇన్ భద్రా అధ్యక్షులు డీవీఎం నాయుడు, కార్యదర్శిగా సాయిరామ్, ఇతర కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు చేపట్టారు. రోటరాక్ట్ డిస్ట్రిక్ట్ ప్రతినిధి అశోక్‌కుమార్ రోటరాక్ట్ క్లబ్ అధ్యక్షుడిగా అరవింద్, కార్యదర్శిగా చైతన్యతో ప్రమాణ స్వీకారం చేయించారు. క్లబ్ మాజీ కార్యదర్శి గోవిందరావు పవర్ పాయింట్ ప్రజేంటేషన్‌తో రోటరీ సామాజిక సేవా కార్యక్రమాలను వివరించారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతి చదివి ఉత్తమ ప్రతిభ కనబరిచిన 27మంది విద్యార్థినిలకు నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో రోటరీ డిస్ట్రిక్ట్ పూర్వ గవర్నర్ బూసిరెడ్డి శంకర్‌రెడ్డి, మల్లాది వాసుదేవ్, డిప్యూటీ గవర్నర్ సాంబశివ రావు, అసిస్టెంట్ గవర్నర్ భూషణ్‌రావు, రోటరీ ప్రతినిధులు టీఎస్ భాస్కరరావు, పీబీ నిరంజన్, శ్యామ్‌కిరణ్, చెంగలరావు, రాజశేఖర్, చాంద్ భాషా, ప్రఫుల్ల కుమార్, ప్రతాప్, నవీన్, నీలి మురళి, అరుణ్‌సాయి, దీపక్, ప్రణీత్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య యువజన సంఘాల అధ్యక్షుడిగా కిషోర్

చంద్రుగొండ: ఆర్యవైశ్య యువజన సంఘాల జిల్లా అధ్యక్షుడిగా చంద్రుగొండకు చెందిన పసుమర్తి కిషోర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా కేంద్రం కొత్తగూడెంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ కిషోర్‌తో ప్రమాణస్వీకారం చేయించారు. జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన కిషోర్ చంద్రుగొండలో విలేకరులతో మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో జిల్లా పదవి ఇచ్చినందుకు రాష్ట్ర నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

తండ్రికి తలకొరివి పెట్టిన కూతురు

బూర్గంపాడు: తండ్రి మృతదేహానికి కూతురు తలకొరివి పెట్టి అంతియ సంస్కారాలు చేసిన ఘటన సారపాకలో ఆదివారం చోటుచేసుకుంది. సారపాక సుందరయ్యనగర్‌కు చెందిన సమ్మయ్య(60) గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ శనివారం రాత్రి మృతిచెందాడు. మృతుడికి కుమారులు లేరు. ఒకతే కుమార్తె ఉంది. దీంతో తండ్రి మృతదేహానికి ఆమె తలకొరివి పెట్టి అంతిమ సంస్కారాలు నిర్వహించింది. బంధుమిత్రుల సహకారంతో ఆమె జోరువానలో తండ్రి అంత్యక్రియలను పూర్తిచేసింది.

తడిసిన రేషన్ బియ్యం

అశ్వాపురం: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ కార్యాలయం వెంబడి ఉన్న చౌకదుకాణంలోకి వర్షపు నీరు భారీగా చేరింది. వరద నీటితో చౌక దుకాణంలో సుమారు పది క్వింటాళ్ల బియ్యం తడిసినట్టు సమాచారం. సంబంధిత అధికారులు స్పందించి న్యాయం చేయాలని రేషన్ డీలర్ భవాని కోరారు.

జాతీయ రహదారికి మరమ్మతులు



జాతీయ రహదారి గుంతలను పూడ్చివేస్తున్న జేసీబీ

అశ్వారావుపేటరూరల్: గడిచిన కొద్ది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో అశ్వారావుపేట–సత్తుపల్లి మార్గంలో జాతీయ రహదారిపై పెద్ద పెద్ద గుంతలు పడ్డాయి. ఈ గుంతలను రోజులు గడుస్తున్న రోడ్లు భవనాల శాఖ అధికారులు పట్టించుకోలేదు. కాగా, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అశ్వారావుపేట మండలం గుమ్మడవల్లి పర్యటనకు వస్తుండగా.. రోడ్లు భవనాల శాఖ అధికారులు హడాహుడిగా ఆదివారం ఉదయం స్థానిక రింగ్ రోడ్ నుంచి పేరాయిగూడెం డివైడర్ వరకు పడిన భారీ గుంతలకు మరమ్మతులు చేయించారు. గుంతల్లో వెట్‌మిక్స్ చిప్స్ పోసి, జేసీబీతో సరి చేశారు. ఈ పనులను ఏఈ కృష్ణార్జున్‌రావు పర్యవేక్షించారు.

ఎడతెరిపిలేని వాన

ఆగకుండా కురుస్తున్న వర్షం ఆదివారమూ కొనసాగింది. ఎడతెరిపిలేని వానతో వాగులువంకలు పొర్లాయి. పలు లోతట్టు ప్రాంతాల్లో వరద నీరు చేరింది. డ్రెయినేజ్ వ్యవస్థ సరిగా లేని కాలనీల్లో వర్షపు నీరు రోడ్లపై చేరింది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రాకపోకలు సాగించ లేని పరిస్థితిలో ఉండిపోయారు. కొన్నిచోట్ల ఇళ్లు కూలిపోయాయి. వాగులువంకలు రోడ్లపైచేరి గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయేలా చేసింది.

– సాక్షి నెట్‌వర్క్



కరకగూడెంలో ప్రవహిస్తున్న పెద్దవాగు



భద్రాచలంటౌన్: పట్టణంలోని ఓ కాలనీలో రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు



మణుగూరుటౌన్: విఠల్‌రావ్ నగర్‌లో నేలకూలిన ఇల్లు



గుండాల: కిన్నెరసాని లోలెవల్ వంతెనపై ఉధృతంగా పారుతున్న వాగు



మణుగూరుటౌన్: పగిడేరుకు వెళ్లే దారిపై ప్రవహిస్తున్న పేరంటాల చెరువు



కరకగూడెం: అలుగు పోస్తున్న పద్మాపురం చెరువు



గుండాల: ఉధృతంగా ప్రవహిస్తున్న మల్లన్న వాగు



భట్టుపల్లి గ్రామంలో ఇళ్ల మధ్యలో నిలిచిన వరదనీరు



అశ్వాపురం: గొందిగూడెంలో ఇసుకవాగుతో నిలిచిన రాకపోకలు

భక్తి శ్రద్ధలతో గురుపౌర్ణమి



మణుగూరురూరల్: ఆలయంలో బారులుదీరిన భక్తులు



చంద్రుగొండ: స్వామివారిని ఊరేగిస్తున్న భక్తులు

బూర్గంపాడు: మండల వ్యాప్తంగా గురుపౌర్ణమి వేడుకలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. బూర్గంపాడు, సారపాక రాజీవ్‌నగర్, సుందరయ్య నగర్‌లలోని సాయిబాబా మందిరాలలో గురుపౌర్ణమి వేడుకలు జరిగాయి. ఇందులో భాగంగా సాయి బాబా మందిరాలను సర్వాంగ సుందరంగా అలంకరించారు. అభిషేకాలు,అలంకరణలు, ప్రత్యేకపూజలు చేశారు. పెద్దసంఖ్యలో పాల్గొన్న భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు.

ములకలపల్లి: మండలవ్యాప్తంగా గురుపౌర్ణమి పర్వదినాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. సాయినాథుడి ఆలయాలను సర్వాంగ సుందరంగా అలంకరించారు. ములకలపల్లిలోని షిర్డీ సాయి బాబా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. భారీగా భక్తజనం హాజరుకాగా, స్థానిక కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు.

దుమ్ముగూడెం: మండలంలో భక్తిశ్రద్ధలతో గురుపౌర్ణమి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. దుమ్ముగూడెం గ్రామంలోని దత్తశేష సాయి బాబా ఆలయంలో బాబా వారికి 108 కలశాలతో అభిషేకం నిర్వహించారు. అలాగే లక్ష్మీనగరం గ్రామంలోని షిర్డిసాయిబాబా ఆలయంలో పంచామృతాలతో బాబా వారికి అభిషేకాలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించి పూజలను నిర్వహించారు. అనంతరం భక్తులకు బాబా దర్శనం కలిగించి తీర్థప్రసాదాలను అందజేశారు. అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో విటివి రమాణారావు, కెల్లా శేఖర్, కెల్లా వేణుగోపాల్, శిరపు అప్పలరెడ్డి, గుడ్ల తాతారావు, గుడ్ల తాతారావు, డల్లి వేణు తదితరులు పాల్గొన్నారు.

భద్రాచలంటౌన్: పట్టణంలోని జూనియర్ కళాశాల సెంటర్‌లోని షిర్డిసాయి బాబావారి మందిరం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. బాబావారికి ప్రత్యేక పూజలు, అలంకరణలు చేశారు. ఉదయం నుంచే భక్తులు బాబావారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ వారు మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు తుమ్మలపల్లి సత్యనారాయణమూర్తి, కుంచాల రమేష్, గొర్ల వెంకటేశ్వరరావు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

అశ్వారావుపేటరూరల్: ఆలయాల్లో గురుపౌర్ణమి పూజలను ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మండలంలోని వినాయకపురం, అశ్వారావుపేటలోని షిరిడీ సాయిబాబా ఆలయాల్లో గురుపౌర్ణమి సందర్భంగా బాబా విగ్రహాలను పూలమాలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఉదయం నుంచే ఆలయాలకు చేరుకున్న భక్తులు ప్రత్యేక పూజలు చేసి, అభిషేకాలు చేశారు. కొంతమంది భక్తులు అశ్వారావుపేటలోని సాయిబాబా ఆలయానికి రూ.1.30లక్షలు విలువ చేసే మైక్‌సెట్, వాటర్ ప్యూరిఫైడ్, ఇతర సామగ్రిను అందజేశారు. ఆలయాల్లో అన్నసమారాధన కార్యక్రమాలను నిర్వహించగా, భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

మణుగూరురూరల్: గురుపౌర్ణమి వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. గురుపౌర్ణమి సందర్భంగా సాయినాథుని ఆలయాలన్ని భక్తజన సందోహంతో కిటకిటలాడాయి. ఆదివారం తెల్లవారుజాము నుంచే సాయినాథునికి అర్చకులు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఉదయం 4.30గంటలకు సుప్రబాతం, కాగడ హారతితో ప్రారంభమయ్యే పూజా కార్యక్రమాలు సాయి బాబాకు అభిషేకాలు, రజత పుష్పార్చన గురు పూజ, ధుని పూజలను నిర్వహించారు. అనంతరం భక్తులకు ఆయా ఆలయ కమిటి సభ్యులు మహాదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. సాయంత్రం సంధ్యాహారతి, పల్లకిసేవ, రాత్రి పవళింపు సేవ కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం భక్తులు తీర్థప్రసాదాలు స్వీకరించి తరించారు.

చంద్రుగొండ: గురుపౌర్ణమిని పురస్కరించుకుని మండలకేంద్రం చంద్రుగొండలోని సాయిబాబా అలయంలో వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం అన్నదానం చేశారు. ఈ సందర్భంగా స్వామివారిని ఊరేగించారు. భక్తులు భక్తిశ్రద్ధలతో ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయ ప్రధాన పూజారి వీవీఆర్‌కే మూర్తి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నెంబర్లకు ఉదయం 7-00 గం॥ల నుండి రాత్రి 8-00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే చర్యలు తీసుకోబడును.

కె. ప్రదీప్ కుమార్, ACM - 70132 21824 | లక్ష్మయ్య, ACO - 8074270476
కొత్తగూడెం యాకూబ్ పాషా - 80083 21148 | భద్రాచలం కె. హరేంద్ర - 99632 02011
పినపాక ఎన్. లక్ష్మయ్య - 80742 70476 | ఇల్లందు బి. కిషన్ - 63052 41411
అశ్వారావుపేట ఎన్. దుర్గారాంప్రసాద్ -9000327175 | టోల్‌ఫ్రీ నెం.: 1800 270 1083

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
Land Line : 08742-282823 / 24

మీరు సాక్షిలో వివాహ, జన్మదిన, పదవీ విరమణ, విదేశీ పర్యటన, స్వదేశాగమనం, అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు, మీ ఆత్మీయులకు శ్రద్ధాంజలి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, బహిరంగ ప్రకటనలు, అతి తక్కువ ఖర్చుతో కొండత స్పందన లభించే క్లాసిఫైడ్ యాడ్స్ ఇవ్వదలచినచో మీరు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు : ఎన్. నాగశేషు, యాడ్స్ మేనేజర్- 99122 20600

టి. రాజేష్ - 90102 23783
ఎ. నాగేశ్వరరావు - 97054 44183